
# సత్యవాక్కు

## క్రైస్తవ మాసపత్రిక




July 1994

# THE WORD OF TRUTH

# ఏకైక సదవకాశము

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్యవాణి" అను రేడియో కార్యక్రమములద్వారా, మరియు మేము ప్రచురించు పుస్తకముల ద్వారా లక్షలాది ప్రజలు ఆత్మీయ మేలులను పొందుచున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు అనేకము మావద్ద కలవు. మీరు కేవలము రూ. **25/-** లు ఈ క్రింది అడ్రసుకు **M.O.** చేసినచో రూ. **100-00** లకు మించిన విలువగల **15** నుండి **20** రకముల పుస్తకములు, మరియు రెండు సంవత్సరముల వరకు "సత్యవాక్కు" అను మాసపత్రిక మీరు పొందగలరు.

వెంటనే మీ పేరు నమోదు చేయించుకొనండి. మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయము తెరవండి. మావద్ద లభించు పుస్తకముల రేట్లు వివరములు పోస్టేజితో సహా

| | | |
|---|---|---|
| 1. | పెద్ద బైబిలు | రూ. 45-00 |
| 2. | పెద్ద అచ్చు బైబిలు | 110-00 |
| 3. | రిఫరెన్సు బైబిలు | 75-00 |
| 4. | 15 నుండి 20 మంచి పుస్తకములు మరియు రెండు సంవత్సరముల పాటు సత్యవాక్కు మాస పత్రిక ఉచితం. | రూ. 25-00 |

గమనిక : మీరు పంపు పైకము **M.O.** ద్వారా పంపవలెను. దేనికొరకు మీరు సొమ్ము పంపుతున్నారో కూడ వ్రాయండి.

**S A T Y A V A N I**

**Sambamurthi St., Ramaraopeta,**

**K A K I N A D A - 533 004.**

# సత్యవాక్యం

**THE WORD OF TRUTH**

P.O. Box 80, KAKINADA, A.P. 533 001

Phone : 0884-73722

Editor :
J.C. CHOATE

Managing Editor :
JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 14 జూలై 1994 సంచిక 12

## సంపాదకీయము

### నేడు దేవుడెట్లు మాట్లాడుచున్నాడు?

### ( How Does God Speak Today )

నేడు దేవుడు మాట్లాడుచున్నాడా ? తప్పకుండా అవును. అయితే ఆయన ఎట్లు మాట్లాడుచున్నాడు ? ఈ ప్రశ్న శతాబ్దముల తరబడి చర్చనీయాంశమైనది. దీని జవాబును తెలిసికొన గలమా ? ఇంకో ప్రశ్న—ఆయన ఎవరితో మాట్లాడుచున్నాడు? ఆయన ఏర్పరచుకొనిన కొంత మందితోనా లేక అందరితోనా ? అయితే ఎట్లు ? ఆయన నేరుగా, వినబడేలాగున మాట్లాడుచున్నాడా? లేక గురుతుల ద్వారానా? లేక స్వప్నములు, దర్శనముల ద్వారానా? ఇంకావేరే విధముగానా? తప్పకుండా మనం ఈ ప్రశ్నలకు జవాబును తెలిసికొనే మార్గమున్నది.

ఈమధ్య ఒక మనుష్యుడు వచ్చి దేవుడతనితో రెండుసార్లు స్వప్నములో మాట్లాడెనని చెప్పాడు. ఇటువంటి సంగతులు మనం ఎన్నిసార్లు వినియుండలేదు? దేవుడు తమకు దర్శనములో కనబడ్డాడని, నేరుగా మాట్లాడాడని, లేదా ఏదో గుర్తు యిచ్చి తన చిత్తాన్ని వారికి తెలియ జేసాడని కొందరు చెప్పగా మనం ఎన్నిసార్లు వినియుండలేదు? అయితే వారికి ఈ అభిప్రాయాలన్నీ ఎక్కడనుండి వచ్చుచున్నవి? బైబిలునుండి మాత్రము కాదు, ఏలయనగా బైబిలు అటువంటి సంగతుల నెన్నడు బోధించుటలేదు. అంటే అట్టివారు అజ్ఞానమువలన, వారి భావములవలన, ఊహలవలన లేదా ఒక అబద్ధ బోధకునివలన మోసగించబడుటవలన అట్లు చెబుతుయుంటారు. దేవుడు నేరుగా తనతో మాట్లాడాడని నమ్మేవారు, యితరులకంటె వారు ప్రముఖుల మని అనుకొంటారు. సరిగదా వారు చెప్పేది అంతా నిజమేనని యిత రులను నమ్మించ ప్రయత్నిస్తారు. అపవాది చాల మోసగాడు. అసత్య మును నమ్మునట్లు చేయడమేగాక, సత్యాన్ని గ్రహించకుండా అట్టి వారి మనో నేత్రములకు అతడు గుడ్డితనము కలుగజేస్తాడు.

దేవుడు నేడు మానవులతో మాట్లాడుచున్నాడు. ఆయన అందరితోను ఒకేలాగున మాట్లాడుచున్నాడు. ఆయన లిఖితపూర్వక మైన లేఖనములద్వారా, బైబిలుద్వారా, మరి ముఖ్యముగా క్రొత్త నిబంధన ద్వారా అందరితోను మాట్లాడుచున్నాడు. క్రీస్తు రెండవ రాకడవరకు ఆయన క్రొత్తనిబంధన ద్వారా మానవులతో మాట్లా డుచు యుంటాడు.

హెబ్రీ పత్రిక లేఖకుడిట్లనుచున్నాడు: "పూర్వకాలమందు నానా సమయములలోను నానావిధములుగాను ప్రవక్తలద్వారా మన పితరులతో మాటలాడిన దేవుడు, ఈ దినముల అంతమందు కుమారుని ద్వారా మనతో మాటలాడెను. ఆయన ఆ కుమారుని

సమస్తమునకును వారసునిగా నియమించెను, ఆయన ద్వారా ప్రపంచములను నిర్మించెను" (హెబ్రీ 1 : 1, 2). యేసు ప్రభువు చేసిన పనులను గూర్చి ఇట్లు వ్రాయబడెను: "మరియు అనేకమైన యితర సూచకక్రియలను యేసు తన శిష్యుల యెదుట చేసెను; అవి యీ గ్రంథమందు వ్రాయబడలేదుగాని, యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అని మీరు నమ్మునట్లును, నమ్మి ఆయన నామమందు జీవము పొందునట్లును ఇవి వ్రాయబడెను" (యోహాను 20 : 30, 31). మరల "దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడి యుండునట్లు దైవావేశమువలన కలిగిన ప్రతిలేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పుదిద్దుటకును, నీతియందు శిక్షణ చేయుటకును ప్రయోజనకరమైయున్నది" యని అపొ. పౌలు చెప్పుచున్నాడు (2 తిమో 3 : 16, 17). "ఆయన దైవశక్తి జీవమునకును భక్తికిని కావలసిన వాటి నన్నిటిని మనకు దయచేసెను" అని అపొ. పేతురు చెప్పెను (2 పేతురు 1 : 3).

మనము దేవుని వాక్యమునకు కలుపుటగాని, తీసివేయుటగాని చేయరాదని చెప్పబడినది (ప్రక 22 : 18, 19). దాని స్థానంలో మరొక దాన్ని ఉంచరాదని చెప్పబడినది (గలతీ 1 : 6-9). గాని మనం ఆయన ఆజ్ఞలకులోబడాలని (ప్రక 22 : 14), వాక్యమును బట్టి నడుచుకోవాలని చెప్పబడింది (యాకోబు 1 : 22). వినుటవలన విశ్వాసము కలుగును. వినుట క్రీస్తును గూర్చిన వాక్యము వలన కలుగును అని అపొ. పౌలు చెప్పాడు (రోమా 10 : 17). క్రొత్త నిబంధన లేఖనములు స్వాతంత్ర్యము నిచ్చు సంపూర్ణ నియమమని యాకోబు చెప్పుచున్నాడు (యాకోబు 1 : 25). మరల క్రీస్తుప్రభువు ఇట్లనుచున్నారు: "ఎవడైనను నా మాటలు వినియు వాటిని గైకొనకుండిన యెడల నేనతనికి తీర్పు తీర్చను; నేను లోకమునకు తీర్పు

తీర్చుటకు రాలేదుగాని, లోకమును రక్షించుటకే వచ్చితిని, నన్ను నిరాకరించి నా మాటలు అంగీకరింపని వానికి తీర్పు తీర్చువాడొకడు కలడు. నేను చెప్పిన మాటయే అంత్యదినమందు వానికి తీర్పు తీర్చును. ఏలయనగా నా అంతట నేనే మాటలాడలేదు. నేను ఏమన వలెనో యేమి మాటలాడవలెనో దానిని గూర్చి నన్ను పంపిన తండ్రియే నా కాజ్ఞ యిచ్చియున్నాడు. మరియు ఆజ్ఞ నిత్యజీవమని నేనెరుగుదును గనుక నేను చెప్పుసంగతులను తండ్రి నాతో చెప్పిన ప్రకారము చెప్పుచున్నాను" (యోహాను 12 : 47-50).

ఇప్పుడు మనం గ్రహించిన దేమిటి? దేవుడెల్ల వేళలా మాట్లాడు చుండెను. అయితే ఈ అంత్యదినములలో, మన దినములలో క్రొత్త నిబంధనలో చెప్పబడిన ప్రకారము తన కుమారుని ద్వారా మనతో మాటలాడెను. మనము ఆయన చిత్తము నెరిగి దానికిలోబడునట్లు ఆయన వాక్యములు మనకు లిఖింపబడియున్నవి. ఆయన అందరి తోను ఒకేలాగున మాట్లాడుచున్నాడు. మరియు అందరు ఆయన గ్రంథమును చదివి గ్రహించుకొని దానికి లోబడినప్పుడు ఆయన అందరిని ఒకే లాగున రక్షించి తన సంఘముతో చేర్చుకొనును (అపో. కా. 2). ఆయన వాక్యము ఎన్నడు నిరర్థకము కాదు గనుక, తీర్పుదినమున కూడ మనం దానిని బట్టియే తీర్పు పొందుదుము (యోహాను 12 : 48). ఆయన వాక్యమును విశ్వసించి దానికిలోబడిన వారు నిత్యరక్షణ పొందుదురు. అయితే అట్లు చేయనివారు, దానిని నిరాకరించినవారు, దానికి కలిపినవారు, దానినుండి కొంత తీసివేసిన వారు దాని వలననే శపింపబడి నిత్య యాతనలోనికి పోవుదురు.

దేవుడు కొందరితో మాట్లాడి, మరి కొందరితో మాట్లాడక పోతే, కొందరికి కనబడి మరికొందరికి కనబడక పోతే, ఆయన పక్షపాతి యగును. ఆయన ఒకనికి ఒకటి చెప్పి మరొకనికి వేరొకటి ఎందుకు

చెబుతారు ? ఒకనికి ఒకలాగున, మరొకనికి ఇంకోలాగున ఆయన ఎందుకు చెబుతారు ? ఆయన అట్లు చేస్తే గజిబిజికి గందరగోళానికి కారకులవుతారు.

సత్యం యేమంటే, దేవుడు తన చిత్తాన్నంతటినీ క్రీస్తుద్వారా మనకు బయలుపరిచేసాడు. అది క్రొత్తనిబంధన పుటలలో వ్రాయబడి యున్నది. ఆయన అందరితోను ఒకేలాగున మాట్లాడుచున్నాడు. ఆయన అందరికీ ఒకే వర్తమానమును బయలు పరచియున్నాడు. ఆయన చెప్పాలనుకున్నదంతా చెప్పేసాడు. గనుక మోసపోవద్దు. దేవుడు మాటలాడేసాడు. నేడు లేఖనములద్వారా తప్ప వేరేవిధంగా ఆయన మాట్లాడుటలేదు. ఆయన చిత్తాన్నంతా బయలుపరచేసాడు. దానికొరకు ఇంకా మనం కనిపెట్టుచున్నట్లయితే అది కేవలంవ్యర్థమే, గనుక మనము ఆయన వాక్యాన్ని వినాలి, విశ్వసించాలి, దానికి లోబడాలి, ఇతరులకు దాన్ని బోధించాలి, ప్రకటించాలి, అప్పుడే మనం రక్షింపబడుదుము.

—o—

కొండమీద ప్రసంగము - 5

## కనికరము గలవారు ధన్యులు

## ( Blessed are the Merciful )

( మత్తయి 5 : 7 )

యేసుప్రభువు కొండమీద చేసిన ప్రసంగములో "కనికరము గలవారు ధన్యులు. వారు కనికరము పొందుదురు" అని చెప్పెను (మత్తయి 5:7). ప్రభువుయొక్క శిష్యులు ఇతరులతో ఉంచుకోవలసిన సంబంధమును గూర్చి ఆయన ఇక్కడ చెప్పియున్నాడు. కనికరము అనుమాట కఠినత్వానికి వ్యతిరేకమైనది. ఆపదలోను నిస్సహాయ స్థితిలోను ఉన్నవారిమీద జాలిపడుట, క్రియాజనకంగా జాలిపడుట అనేభావం ఈ మాటలో ఇమిడి యున్నది.

# కనికరము గల ప్రభువు

ఒకసారి ఇద్దరు గ్రుడ్డివారు యేసుప్రభువు నొద్దకు వచ్చి "దావీదు కుమారుడా మమ్మును కనికరించుమని కేకలు వేసిరి". అప్పుడాయన వారి కన్నులు తెరిచెను (మత్తయి 9:27-29). "కనాను స్త్రీ యొకతె వచ్చి - ప్రభువా, దావీదు కుమారుడా, నన్ను కరుణింపుము, నా కుమార్తె దయ్యము పట్టి బహు బాధపడుచున్నదని కేకలు వేసెను". ప్రభువు ఆమె కుమార్తెను స్వస్థపరిచెను (మత్త 15 : 21-28). "ఒకడు ఆయనయొద్దకు వచ్చి ఆయన యెదుట మోకాళ్ళూని ప్రభువా నా కుమారుని కరుణింపుము. వాడు చాంద్రరోగియై మిక్కిలి బాధ పడుచున్నాడనెను". ఆయన ఆ చిన్నవానిని స్వస్థపరచెను (మత్తయి 17 : 14-18). సేన అను దయ్యముపట్టిన వానిపై ప్రభువు కనికరపడి వానిలోనుండి ఆ దయ్యముల మందను పారద్రోలెను (మార్కు 5 : 1-19). ఇప్పటివరకు మనము చూచిన సందర్భాలన్నిటిలోను ప్రభువు వారిపై కనికరపడినట్లు చూడగలము. కనికరపడుట అనగా జాలిపడుట. కనికరము చూపు వారిపై దేవుడు కనికరము చూపును. "కాబట్టి మీ తండ్రి కనికరము గలవాడై యున్నట్టు మీరును కనికరము గలవారై యుండుడి" అని ప్రభువు బోధించెను (లూకా 6:36).

కనికరము చూపుట మంచిది. దానినే ప్రభువు కోరుచున్నాడు. మీకా ఇట్లు వ్రాయుచున్నాడు: "మనుష్యుడా, ఏది ఉత్తమమో అది నీకు తెలియజేయబడి యున్నది. న్యాయముగా నడుచుకొనుటయు, కనికరమును, ప్రేమించుటయు, దీనమనస్సు కలిగి నీ దేవుని యెదుట ప్రవర్తించుటయు, ఇంతేగదా యెహోవా నిన్నడుగుచున్నాడు" (మీకా 6:8). మన దేవుడు "కనికరము చూపు తండ్రి,

సమస్తమైన ఆదరణను అనుగ్రహించు దేవుడు" (2 కొరింథీ 1:3). మానవుడు దేవుని బిడ్డవలె యుండవలెనంటే దైవలక్షణమైన కనికరమును అతడు అలవరచుకొనాలి.

## యోనా నేర్చుకొనిన పాఠము

పాతనిబంధనలో యోనా యొక్క కథనమును మనందరము ఎరిగినవారమే. నీనెవె పట్టణస్థుల దోషము యెహోవా దృష్టికి ఘోరమాయెను. గనుక ఇక నలువది దినములకు ఆ పట్టణమును యెహోవా నాశనము చేయునని యోనా వారికి ప్రకటించెను. దేవుని ఆజ్ఞ మేరకు అతడా పనిని చేసెను. యోనా ప్రకటన విని నీనెవెవారు బహు దుఃఖముతో తమ చెడునడతలను మానుకొనగా దేవుడు వారికి కీడుచేయక మానెను. యోనా దీనిని చూచి బహు చింతాక్రాంతుడై కోపగించుకొనెను. దేవుడు చెప్పినట్లు నీనెవె పట్టణము నాశనము గావించబడాలని అతడు కాంక్షించాడు. అతడు దేవుని ప్రవక్తయే అయినను, దైవలక్షణము ననుకరించలేక పోయెను. అతడు బోధకుడే గాని అతనికే బోధ అవుసరమాయెను. యోనా కోపగించుకొని ఆ పట్టణములో నుండి పోయి దాని తూర్పు తట్టున బసచేసి అచ్చట పందిలి యొకటి వేసికొని పట్టణమునకు ఏమి సంభవించునో చూచెదనని కూర్చుండెను. అతడీలాగున సత్యాగ్రహము చేయుచుండగా దేవుడొక సొరచెట్టును అతని తలపై నీడగా యుండుటకు మొలిపించెను. మరుసటి దినమందు ఒక పురుగు వచ్చి ఆ చెట్టును తొలిచినందున అది వాడిపోయెను. దానిని గూర్చి యోనా కోపగించుకొనెను. అతడా చెట్టును గూర్చి అంత జాలిపడుచున్న యెడల, నూట ఇరువది వేలకంటె ఎక్కువైన జనమును, బహు పశువులును గల నీనెవె మహాపురమును గూర్చి నేను జాలిపడుట మంచిది కాదా? యని దేవుడు యోనాను ప్రశ్నించెను. కనికరమును గూర్చి దేవుడు యోనాకు ఒక గొప్ప పాఠము

నేర్పించెను. అందుకే "కనికరము చూపనివాడు కనికరములేని తీర్పు పొందును; కనికరము తీర్పును మించి అతిశయపడును" అని భక్తుడైన యాకోబు వ్రాసాడు (యాకోబు 2:13).

## కనికరము గల తండ్రి

తప్పిపోయిన కుమారుని విషయంలో చూస్తే అతడు తిరిగి వచ్చినప్పుడు నిజానికి అతని తండ్రి వానిని యింటినుండి పారద్రోలాలి. అతడు మనస్సు మార్చుకొని తిరిగి వచ్చాడు. "వాడింక దూరముగా ఉన్నప్పుడు తండ్రి వానిని చూచి కనికరపడి, పరుగెత్తి వాని మెడ మీద పడి ముద్దు పెట్టుకొనెను" (లూకా 15:20). కనికరము అతని అంగీకరించింది. అందువలన తండ్రి కుమారులు సంతోషింపసాగిరి. కనికరము వలన రెట్టింపు ధన్యత కలుగుతుంది. కనికరము చూపువారు ధన్యులు, దానిని పొందువారుకూడ ధన్యులే. "కనికరము గలవారు ధన్యులు. వారు కనికరము పొందుదురు". తప్పిపోయి తిరిగి వచ్చిన కుమారునిపై అతని తండ్రి జాలిపడినట్లు, యెహోవా తనయందు భయభక్తులుగలవారి యెడల జాలిపడును. "మనము నిర్మింపబడిన రీతి ఆయనకు తెలిసేయున్నది. మనము మంటివారమని ఆయన జ్ఞాపకము చేసికొనుచున్నాడు" (కీర్తన 103:13, 14). మన తండ్రియైన దేవుడు ఎంతో జాలియు కనికరము గలవాడు.

దేవుడు ఖచ్చితంగా న్యాయాన్ని అమలుపర్చినట్లయితే మనలో ఎవడు పరలోకం చేరుకోలేడు. ఏలయనగా అందరును పాపము చేసి దేవునిమహిమను మహిమను పొందలేక పోవుచున్నారు (రోమా 3:23). అయితే క్రీస్తు సిలువమీద "కృపాసత్యములు కలసికొనినవి. నీతి సమాధానములు ఒకదాని కొకటి ముద్దు పెట్టుకొనినవి" (కీర్తన 85 : 10). మానవుని పాపముల వలన అతడు పరలోక పట్టణములో ప్రవేశింపనేరడని సత్యము చెప్పుచున్నది. మానవుని

అతిక్రమములను క్రీస్తు రక్తముచేత కప్పివేయుమని దేవుని కృప చెప్పుచున్నది. పాపియైనవాడు పరలోక ద్వారముల దరికి చేరుట మంచిది కాదని నీతి చెప్పుచున్నది. మానవునికి అతని సృష్టికర్తకు మధ్య సంధి చేయునట్లు క్రీస్తును మధ్యవర్తిగా నుండనిమ్మని సమాధానము చెప్పుచున్నది. దేవుని కనికరం మనయెడల లేకపోతే ఒక్క క్షణం కూడ బ్రతుకలేము. పరలోకం ప్రవేశించలేము.

## దేవుడు కనికరమునే కోరును

"నేను బలిని కోరను గాని కనికరమునే కోరుచున్నాను. దహనబలులకంటె దేవుని గూర్చిన జ్ఞానము నాకిష్టమైనది" యని హోషేయ 6:6 లో దేవుడు చెప్పాడు. దీని భావమేమిటో మీరే తెలిసికోవాలని యేసుప్రభువు కనీసం రెండుమారులు ఆనాటి ప్రజలను హెచ్చరించారు. యూదులు జంతుబలులు అర్పించకూడదని కాదుగాని, బలిని కనికరాన్ని కోరుకోవలస్తే ఆయన కనికరమునే కోరువాడు. ఒకడు రక్షించబడుటకు పాపక్షమాపణ నిమిత్తం నీటిలో ముంచబడాలి. ముంచబడిన తరువాత, అంటే క్రైస్తవుడైన తరువాత జాలి కనికరం తన జీవితంలో లేకపోతే అతడు ముంచబడింది వ్యర్థమే. క్రైస్తవుడని పేరు పెట్టుకొనిన తరువాత దిక్కులేనివారిని గూర్చి అనాథలనుగూర్చి కనికరం లేకపోతే అతడు క్రైస్తవుడగుట నిష్ప్రయోజనమే. "సహోదరుడైనను సహోదరియైనను దిగంబరులై ఆనాటికి భోజనము లేకయున్నప్పుడు మీలో ఎవడైనను శరీరమునకు కావలసిన వాటిని ఇయ్యక సమాధానముగా వెళ్ళుడి, చలి కాచుకొనుడి, తృప్తి పొందుడి యని చెప్పిన యెడల ఏమి ప్రయోజనము?" అని భక్తుడైన యాకోబు అడుగుచున్నాడు (యాకోబు 2:15, 16). క్రైస్తవుడను పేరు పెట్టుకోవద్దని దీని ఉద్దేశ్యముకాదు. ఏలయనగా ఆ పేరునుబట్టియే మనము దేవుని మహిమపరచవలెను (1 పేతురు 4 : 16). దేవుడు బలులకంటె కనికరమును కోరుచున్నాడని మనము గ్రహించాలి.

మానవుడు తన స్వకీయ ఆత్మ క్షేమముకొరకు దైవలక్షణమగు కనికరమును కలిగియుండాలి, ఏలయనగా మనుష్యుడు ఏమి విత్తునో, ఆపంటనే కోయును (గలతీ 6:7). అయినను "ఒకని ప్రవర్తన యెహోవాకు ప్రీతికరమగునప్పుడు ఆయన వాని శత్రువులను సహా మిత్రులుగా చేయును" (సామె 16 : 7). మరల, "మీరు మంచి విషయములలో ఆసక్తిగలవారైతే మీకు హాని చేయువాడెవడు?" (1 పేతురు 3 : 13). మనము కఠినముగాను, క్రూరముగాను ప్రవర్తించిన యెడల అట్టివారినే మనమీదికి దేవుడు లేవనెత్తును. మనము కఠినముగా తీర్పు తీర్చిన యెడల మనకును అట్లే తీర్పుతీర్చబడును. "మీరు తీర్చు తీర్పుచొప్పుననే మిమ్మును గూర్చియు తీర్పుతీర్చబడును. మీరు కొలుచు కొలతచొప్పుననే మీకును కొలువబడును" (మత్తయి 7 : 1-2).

క్రైస్తవుల అతిక్రమములను దేవుడు తన కనికరము చొప్పున క్షమించియున్నాడు. మరియు "మీలో ప్రతివాడును తన సహోదరుని హృదయపూర్వకముగా క్షమింపని యెడల నా పరలోకపు తండ్రియు ఆప్రకారమే మీయెడల చేయునని" యేసు ప్రభువు చెప్పెను (మత్తయి 18 : 34-35). మనం క్షమాపణ పొందాలంటే మనం క్షమించాలి. "మనుష్యుల అపరాధములను మీరు క్షమించిన యెడల, మీ పరలోకపు తండ్రియు మీ అపరాధములను క్షమించును. మీరు మనుష్యుల అపరాధములను క్షమింపకపోయిన యెడల మీతండ్రియు మీ అపరాధములను క్షమింపడు" (మత్తయి 6 : 14, 15). దేవుని దగ్గర మనము కనికరము పొందాలంటే మనం కనికరం చూపాలి.

దేవుని దృష్టిలో నీతిమంతులముగా తీర్చబడాలంటే, యేసే దేవుని కుమారుడని విశ్వసించాలి. నేను ఆయననని మీరు విశ్వసింపని

యెడల మీ పాపములలోనే మరణింతురని ఆయన చెప్పెను. (యోహా 8 : 24). పాపముల విషయమై మారుమనస్సు పొందాలి. పాపక్షమాపణ నిమిత్తం క్రీస్తునామమున బాప్తిస్మము పొందాలి. (అపొ. కా. 2 : 38). దైవ లక్షణమగు కనికరం, జాలి, దయ వగయిరాలను జీవితంలో అలవర్చుకోవాలి. "కనికరముగలవారు ధన్యులు; వారు కనికరము పొందుదురు." — జాషువా గూటం.

— o —

## క్రైస్తవ్యము పాశ్చాత్యుని మతము కాదు

క్రైస్తవ్యము పాశ్చాత్యుని మతమని ఎవరంటారో, వారు వాస్తవములను సరిగా ఎరిగినవారు కారు.

## క్రైస్తవ్యము పశ్చిమాన కాదు, తూర్పుననే ప్రారంభమాయెను :

1. క్రీస్తు ఆసియాలోనే జన్మించి, జీవించి, మరణించి, తిరిగి లేచెను. ఆయన మృతులలోనుండి లేచెను. ఆయన దేవుని యొద్దకు ఆసియా నుండే ఆరోహణ మాయెను. ఆయన పశ్చిమ ప్రాంతములో ఎన్నడును పర్యటించలేదు. లూకా 2; మత్తయి 27, 28; అపొ. 1:9.

2. క్రీస్తు సంఘము ఆసియాలోనే ఆరంభమై, ప్రపంచమంతా వ్యాపించెను. అపొ. 2:41-47; 1 కొరింథీ 16:19; ప్రకటన 1 : 4.

3. అది తూర్పున ప్రారంభమై అన్ని కాలములలో సర్వ దేశములందలి సర్వ మానవుల నిమిత్తమైన దేవుని స్వంత మతము. మత్తయి 28 : 19, 20; మార్కు 16:15, 16.

4. క్రీస్తుబోధ ఒక దేశమునకే పరిమితము కాదు. దాని రక్షణ సందేశము, నిత్యజీవము అందరకు అవసరము. దాని గొప్ప

జీవిత సూత్రములు సర్వ దేశములందలి ఎల్లరకు ఎటువంటి రాజకీయ షాలన క్రింద ఉన్న వారికైనను అనుగుణ్యమైనవే.

**క్రైస్తవ్యము మానవజాతిని ఉద్ధరించును :**

నిజ క్రైస్తవ్యము, క్రీస్తుచే బోధింప బడినందున, తూర్పునగాని పశ్చిమానగాని ఉన్న దేశములను, మానవుల్లను ఉద్ధరించును. బైబిలును చదువుము. నిజ క్రైస్తవ్యమును తెలిసికొనుము.

**ఆదిమ సంఘ పునరుద్ధరణ ఒక ఘనమైన కృషి :**

సంఘారంభమును గూర్చి బైబిలు చెప్పుచున్నది. గొప్ప విశ్వాస భ్రష్టత్వమును గూర్చి కూడ అది ప్రవచించింది (2 థెస్స 2:3). ఒక్కగా నొక్కసారే బయల్పరచబడిన విశ్వాసము నుండి, తొలగిపోవుటమైనది (1 తిమో 4:1; యూదా: 3; 2 పేతురు 2:1,2). మానవులు వివిధ రీతులుగ తొలగిపోవుటవలన అనేక శాఖలు ఉద్భవించినవి. అయినను ఆదిమ సంఘమును గూర్చిన క్రీస్తు సంకల్పము ఇరికెా యేమియు మార్పు నొందలేదు.

నీ క్రొత్త నిబంధనను తీసికొని దానిని మరల చదువుము. అప్పుడు క్రొత్త నిబంధన సంఘాన్ని తిరిగి నెలకొల్పు. క్రైస్తవ్యముతో యూదా మతాన్ని (పాత నిబంధన మతాన్ని) మిళితం చేయ వద్దు. మానవుల సిద్ధాంతాలను కూడా మనం అనుసరింపరాదు (గలతీ 1:8, 9). పవిత్ర క్రొత్తనిబంధన క్రైస్తవ్యాన్ని పునరుద్ధరించుదాం.

యూదా మతాచారము లనేకములు ఆ కాలము మట్టుకే చెందినవి. క్రొత్తనిబంధనలో క్రీస్తు సంఘము యొక్క ఆరాధనలో అవి ఒక భాగముగా ఎన్నడు చేయబడలేదు. పశుబలులు, ధూపార్పణలు, వాద్య సంగీతము మొదలగునవి ఎన్నడు క్రైస్తవారాధనలో

ఒక భాగం కాదు. క్రైస్తవులు తమ ఆరాధనలో పాటలు పాడిరి గాని వాయిద్యముల నెన్నడు వినియోగించలేదు (రోమా 15:9; అపొ. కా. 16:25; ఎఫెసీ 5:19; కొలస్స 3:16; హెబ్రీ 1:12, యాకోబు 5:13). క్రైస్తవులు పాతనిబంధన సబ్బాతు నెన్నడు ఆచరించలేదు గాని (కొలస్స 2:14-16), క్రీస్తు పునరుత్థాన దినమగు ఆదివారమున కూడుకొనుచుండిరి (అపొ. కా. 20:7, 1 కొరింథీ 16:2).

పవిత్ర క్రొత్తనిబంధన క్రైస్తవ్యాన్ని గూర్చిన విజ్ఞాపనను కొందరు పోషణ చేతురు. ధైర్యము గలవారు ఆయన సత్యాన్ని నిలబెట్టాలని దేవుడు కోరుచున్నాడు. దేవుని వాక్యానికి లోబడుటయే నిత్య ప్రాముఖ్యాంశములను జరిగించుట అని జ్ఞాపక ముంచుకొనుము.

—చార్ల్స్ స్కాట్

— o —

## మీ జీవమే పాటిది?

## (What is your life?)

"...మీ జీవమేపాటిది? మీరు కొంతసేపు కనబడి అంతలో మాయమై పోవు ఆవిరివంటి వారే" (యాకోబు 4:14). మానవుని యొక్క జీవితం ఆవిరికి పోల్చబడినది. బైబిలు గ్రంథమందు మానవుని జీవితం గడ్డిపువ్వుతోను, అడవి పువ్వుతోను నీడతోను పోల్చబడినది (కీర్తనలు 103:15,16; యోబు 14:2). అయినను మానవులు ఈ జీవితం గూర్చి అనేక ఆలోచనలు కలిగి యుందురు. మానవ జీవితం యొక్క ఆరంభము, ఉద్దేశ్యము, వ్యవధి మరియు గమ్యమును తెలిసికొనుట చాలా అవసరం.

### మానవ జీవితారంభము

జ్ఞానులు శాస్త్రజ్ఞులు, పండితులు చాలా మంది మానవ

జీవితం యొక్క ఆరంభమును గూర్చి తెలిసికొనుటకు అనేక ప్రయత్నములు సల్పిరి. తమ జ్ఞానము, ప్రయత్నములు ప్రయోగాల ద్వారా దాని కనుగొన లేకపోయారు. వారు తమ అభిప్రాయము లను మాత్రమే తెలుప గలరు. అట్టి అభిప్రాయములు ఋజువు చేయ బడవు. వారి సిద్ధాంతములను నమ్ముటకు కనీసం ఒక్క ఆధారమైన ఉండదు. పరిశుద్ధ గ్రంథము ఒక్కటే సరియైన సమాధానం యిస్తుంది. అది సత్యమైనది, సంపూర్ణంగ నిస్సందేహంగా నమ్మదగినది. దేవుడు తన స్వరూప మందు నరుని సృజించెను: దేవుని స్వరూపమందు వాని సృజించెను. స్త్రీనిగాను, పురుషునిగాను వారిని సృజించెను (ఆదికాం డము 1 : 27). దేవుడైన యెహోవా నేలమంటితో నరుని నిర్మించి వాని నాసికారంధ్రములలో జీవవాయువును ఊదగా నరుడు జీవాత్మ ఆయెను (ఆది 2 : 7). దేవుడు మానవుని సృజించక ముందు అతనికి కావలసినదంతయు మొదట సృజించెను (ఆది. కా. 1 : 1-25). దీనిని బట్టి మానవ జీవితము సంకల్పింపబడినదని అతడు జీవించుటకు కావలసినవన్నియు దేవుడెరిగియుండి ఒక క్రమపద్ధతిలో సమస్తసృష్టిని సృజించెనని తెలిసికొనగలము. మానవ జీవితం దేవునియొద్ద ప్రారంభ మైనందున అతని ఆత్మ తిరిగి దేవుని యొద్దకు చేరును.

"మన్నయినది వెనుకటివలెనే మరలా భూమికి చేరును. ఆత్మ దాని దయచేసిన దేవుని యొద్దకు మరల పోవును" (ప్రసంగి 12:7). మానవుని జీవము దేవునివలన ఆరంభమైనదని దేవుడు మానవుని సృజించెనని ఎరిగిన దావీదురాజు—"నీవు నన్ను కలుగజేసిన విధము చూడగా భయమును ఆశ్చర్యమును పుట్టుచున్నది" అని పల్కెను (కీర్తనలు 139:14). పై వాక్యాధారముల వలన మానవుని జీవితము దేవుడు ప్రారంభించెనని తెలిసికొనగలము.

# ఉద్దేశ్యము

నిర్మింపబడిన ప్రతీది ఒక ఉద్దేశ్యముతో నిర్మింపబడును. అలాగే దేవుని పోలికగా సృజింపబడిన మానవుని జీవితంలో కూడా ఉద్దేశ్యము ఒకటుంది. ఈ లోకంలో మన జీవితాశయం ఏమిటి? లోకజ్ఞానము సంపాదించుకొనుట కాదు. ఎందుకనగా "ఈ లోక జ్ఞానమును దేవుడు వెర్రితనముగా చేసియున్నాడు" (1 కొరింధి 1:20). ఈ లోక జ్ఞానము చేత మనము దేవుని తెలిసికొనలేము (వ 21). జ్ఞానులు సిగ్గు పర్చబడిరి (వ 27). తమ జ్ఞానముతో ఆలోచనతో దేవుని ఆజ్ఞలను ఉల్లంఘించు వారు దండన నొందుదురు. పరిశుద్ధ గ్రంధము దేవుని ఆలోచనతో వ్రాయబడిన దేవుని వాక్యము. దానికి మానవ తలంపులను కలిపి సత్యమార్గమును చెరిపినారు మతశాఖల వారందరు. అట్టివారు "నా తలంపులు మీ తలంపులవంటివి కావు. మీ త్రోవలు నా త్రోవల వంటివి కావు" అని యెహోవా సెలవిచ్చుచున్నాడు (యెషయా 55:8) అని తెలిసికొనవలెను.

మన జీవితంయొక్క ఉద్దేశ్యము ఈ లోక సంబంధమైన ధనము, ఐశ్వర్యము సంపాదించుట కాదు. "ఐశ్వర్యము పొంద ప్రయాస పడకుము. నీకు అట్టి అభిప్రాయము కలిగినను దాని విడిచిపెట్టుము" (సామెతలు 23 : 4) అని సొలోమోను చెప్పుచున్నాడు. "క్షయమైన ఆహారము కొరకు కష్టపడకుడి, గాని నిత్యజీవము కలుగజేయు అక్షయమైన ఆహారముకొరకే కష్టపడుడి" అని యేసు చెప్పెను (యోహాను 6:27). అన్న వస్త్రములు గలవారై యుండి వాటితో తృప్తి పొంది యుండవలెనని, ధనాపేక్ష సమస్తమైన కీడులకు మూలము అని పౌలు చెప్పుచున్నాడు (1 తిమోతి 6:7-10). యేసుప్రభువు మనకు కావలసిన వన్నియు దయజేస్తానని వాగ్దానం చేసాడు (మత్తయి 6 : 33). ఒక మనుష్యుడు లోకమంతయు సంపాదించుకొని తన ప్రాణమును పోగొట్టు

కొంటే అతని కేమి ప్రయోజనం? (మత్తయి 16:26). కనుక ఈ లోకంలో ధన సంపాదన మన జీవిత లక్ష్యం కాకూడదు.

పాపభోగములు అనుభవించుట కాదు మానవ జీవితాశయం. క్రైస్తవుడు తన జీవితమును అనుభవించాలని, జీవమున్ను ప్రేమించి మంచి దినములు చూడాలని దేవుని సంకల్పం. క్రైస్తవుడు నిజమైన సంతోషం పొందగలడు. కాని పాపమువలన కలుగు క్షణిక సంతోషంతో కాదు. లోకమునైనను లోకములో ఉన్న వాటినైనను ప్రేమింపకూడదు (1 యోహాను 1 : 15). తల్లినైనను, తండ్రినైనను కుమారునినైనను, కుమార్తెనైనను యేసుక్రీస్తుకంటే ఎక్కువగా ప్రేమింప కూడదు (మత్తయి 10:37). భక్తిహీనతను ఇహలోక సంబంధమైన దురాశలను విసర్జించాలి (తీతు 2:12). మానవుడు పాపము చేయకూడదని దేవుడు నిషేధించాడు. ఎందుకనగా "పాపమువలన వచ్చు జీతము మరణము" (రోమా 6 : 23). అందువలన మన జీవితం యొక్క ఉద్దేశ్యం పాప భోగములు అనుభవించుట కాదు.

## దేవుని ఘనపరచాలి

భూమిపైన మానవుని జీవితంయొక్క ఉద్దేశ్యం—దేవుని ఘన పర్చుట మహిమపర్చుట (రోమా 15:6). కీర్తనల గ్రంథకర్త యిలా అన్నాడు: "యెహోవా యందు భయభక్తులు గలవారా, ఆయనను స్తుతించుడి. ఇశ్రాయేలు వంశస్తురాలా, మీరందరు ఆయనను ఘనపర్చుడి" (కీర్తనలు 22:23). ".. మీ దేహములతో దేవుని మహిమ పరచుడి" అని పౌలు వ్రాసాడు (1 కొరింథీ 6 : 20). యేసుప్రభువు "మనుష్యులు మీ సత్క్రియలను చూచి పరలోకమందున్న మీ తండ్రిని మహిమ పర్చునట్లు వారి యెదుట మీ వెలుగు ప్రకాశింప నియ్యుడి" అని బోధించాడు (మత్తయి 5:16). మరియు పేతురు "ఎవడైనను క్రైస్తవుడైనందుకు బాధ అనుభవించిన యెడల అతడు

సిగ్గుపడక ఆ పేరునుబట్టియే దేవుని మహిమ పరచవలెను" అని వ్రాసాడు (1 పేతురు 4 : 16). ఈ వాక్యముల వలన మానవ జీవిత ఉద్దేశ్యము దేవుని మహిమపరచుట అని తెలిసికొనగలము. గనుక మన మాటలు క్రియలు సమస్తమును ఆయనను మహిమపరుచునవిగా యుండాలి. సత్క్రియలు చేయాలి. వాటి వలన దేవునికి మహిమ కలుగును.

మానవ జీవితము యొక్క మరియొక ఉద్దేశ్యము - శాశ్వత జీవము కొరకు సిద్ధపడాలి. జ్ఞానియైన సొలొమోను పలికిన మాటను గమనించండి. "ఇదంతయు విన్న తరువాత తేలిన ఫలితార్థ మిదే, దేవుని యందు భయభక్తులు కలిగియుండి ఆయన కట్టడల ననుసరించి నడుచుచుండ వలెను. మానవకోటికి ఇదియే విధి. గూఢమైన ప్రతి అంశమును గూర్చి దేవుడు విమర్శ చేయునప్పుడు ఆయన ప్రతి క్రియను అది మంచిదే గాని చెడ్డదే గాని, తీర్పులోనికి తెచ్చును" (ప్రసంగి 12 : 13, 14). మనందరము క్రీస్తు న్యాయ పీఠము ఎదుట ప్రత్యక్షము కావలెనని పౌలుకూడా చెప్పుచున్నాడు. (2 కొరింథీ 5:10). కనుక మనము నిత్యత్వము కొరకు సిద్ధపడాలి. దానికొరకు మొదట ఒకడు సువార్తకు విధేయుడై రక్షింపబడాలి. రక్షింపబడిన తరువాత అంతమువరకు మన స్వంత రక్షణను భయముతోను వణకు తోను కొనసాగించుకోవాలి (ఫిలిప్పీ 2:12). మరియు మరణము వరకు నమ్మకంగా ఉండాలి (ప్రకటన 2:10).

—వి.జె. బెన్ సన్, హైదరాబాదు.

— o —

## "అయ్యా, మేము యేసును చూడగోరుచున్నాము"

( యోహాను 12 : 20-21 )

సహాయమును కోరి ఆరాధనకు వచ్చిన యిద్దరు మనుష్యుల కథ

యుది. వారిలో ఒకరు వ్యాపారములో సమస్తమును కోల్పోయి ఆత్మహత్యకు సిద్ధపడియున్న ఒక వ్యాపారి. మరొకరు దుర్వ్యాపారము కొరకు పెద్ద మొత్తములో ప్రభుత్వ ధనమును అపహరించిన ఒక యౌవనస్థుడు మరో అందమైన యువతి. ఈమె అవినీతిలోనికి నెట్టబడింది. ఆరాధనలో పాటలు ప్రార్థనల అనంతరము బోధకుడు "అంగారక గ్రహంలో జీవులున్నారా?" అను అంశమును బోధించెను.

వ్యాపారి ఆత్మహత్య చేసికొనెను. యౌవనస్థుడు పట్టుబడి యావజ్జీవ కారాగార శిక్షనొందెను. యువతి సిగ్గుకరమైన స్థితిలోనే ఉండి విడుదల పొందలేకపోయెను.

ప్రతి ప్రసంగ వేదిక మానవాళికి ఏకైక నిరీక్షణయైన క్రీస్తును ప్రతిబింబింప చేయాలి ఆయన పాపులకు స్నేహితుడు క్రైస్తవులకు ప్రధాన యాజకుడు. ప్రపంచము నేడు ఎక్కువగా క్రీస్తును చూడగోరు చున్నది. పరిశుద్ధుడు, ఉన్నతమైనవాడునునై యున్న యేసుక్రీస్తు తప్ప ఎవరును ఏదియును మనుష్యులను చేర్చుకొనుటలేదు (యోహా 12:32). సువార్తకు విధేయులగుట ద్వారా క్రీస్తునొద్దకు చేరినయెడల మన కష్టకాలంలో దయను కృపను పొందగలము (హెబ్రీ 4:14-16; 1 కొరింధీ 2:2; 2 కొరింథీ 4:5).

— బిల్ డిల్లాన్.

— o —

---

సత్యవాక్కు పాఠకులకు విజ్ఞప్తి : మీకు సత్యవాక్కు పత్రిక ఒక కాపీ కంటె ఎక్కువగా అందుచున్న యెడల వెంటనే మాకు తెలియజేయండి. మీ సత్యవాక్కు నెంబరుకూడ తెలియపర్చండి.

# పరిశుద్ధాత్మ అనగా దేవుని ఆత్మ

(గత సంచిక తరువాయి)

## ఎ) పరిశుద్ధాత్మ బాప్తిస్మము

(1) ఇది వాగ్దానము. అ. కార్యములు 2 : 33.

(2) దీనిని జరిగించువాడు - క్రీస్తు. మత్తయి 3 : 11.

(a) క్రీస్తు మరణము, సమాధి, పునరుత్థానములోనికి కాదు.

(3) ఇది అపొస్తలులకు చేయబడిన వాగ్దానము (అ. కార్యములు 2 : 1-4; 10).

(4) ఆకాశమునుండి వచ్చినది (అ. కార్యములు 2 : 2).

(a) రక్షణ కొరకు కాదు.

(5) పాపక్షమాపణ నిమిత్తము కాదు. యోహాను 16 : 13.

(6) తండ్రి కుమార పరిశుద్ధాత్మలోనికి ఇచ్చినది కాదు.

(7) రెండు సందర్భములయందే జరిగెను. ఇది ఆజ్ఞ కాదు.

(1) అపొస్తలులు — అ. కార్యములు 2వ అధ్యా
(2) కొర్నేలి యింటివద్ద — 10వ అధ్యాయము.

## బి) నీటి బాప్తిస్మము

1. నీటి బాప్తిస్మము ఆజ్ఞ (అ. కార్యములు 10 : 48).
2. మానవుడే బాప్తిస్మమిచ్చును (మత్తయి 28 : 18-20).
3. నీటి బాప్తిస్మము లోకమంతటికి (మార్కు 16 : 15-16).
4. ఇది నీటిలో జరుగును (యోహాను 3 : 3-6).
5. తండ్రి కుమార పరిశుద్ధాత్మలోనికి ఇవ్వబడును (మత్తయి 28 : 19).
6. లోకమంతమయ్యే వరకు నీటి బాప్తిస్మము ఇవ్వబడవలెను.
7. అపొ. కార్యములలో అనేక ఉదాహరణములు గలవు.

## సి) అపొస్తలులు పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందుటలో దేవుని ఉద్దేశ్యము

1. సత్యమును గూర్చి సాక్ష్యము ఇచ్చుటకు.
2. సర్వ సత్యములోనికి నడిపించుటకు:

క్రైస్తవులు సాక్ష్యులు కారా ? వీరు క్రీస్తును గూర్చిన సాక్ష్యులు కారనుటకు కారణం ? వీరు క్రీస్తును చూడలేదు. క్రీస్తు బోధలు వినలేదు. ఆయన చేసిన అద్భుతములు చూడలేదు. క్రీస్తుతో క్రైస్తవులు ఆయా పట్టణములను ఆయా ప్రదేశములను చూడలేదు. అసలు సాక్ష్యము అనగా నేమి ? ఉదా :-హత్య జరుగుట చూచినవాడు సాక్షి గాని హత్య చేయబడినవాడుగాని ఆ హత్యను చూడనివాడు గాని సాక్ష్యము ఇవ్వడుగదా ?

అందువలన అపొస్తలులు ఆయన (క్రీస్తు) తో నుండిరి. అద్భుతములు, మహాత్కార్యములు చూచిరి గనుక ఆయనను గూర్చిన సాక్ష్యులు అపొస్తలులే. "జీవవాక్యమును గూర్చినది ఆదినుండి ఏది యుండెనో మేమేది వింటిమో, కన్నులారా ఏది చూచితిమో ఏది నిదానించి కనుగొంటిమో మా చేతులు దేనిని తాకి చూచెనో అది మీకు తెలియజేయుచున్నాము. ఆ జీవము ప్రత్యక్షమాయెను. తండ్రియొద్ద నుండి మాకు ప్రత్యక్షమైన ఆ నిత్యజీవమును మేము చూచి ఆ జీవమునుగూర్చి సాక్ష్యమిచ్చుచు దానిని మీకు తెలియపర్చుచున్నాము" (1 యోహాను 1:1-3).

3. భాషలు మాట్లాడునట్లు శక్తి నిచ్చుటకు పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందిరి.

4. క్రీస్తు పేరిట అద్భుతములు, మహాత్కార్యములు చేయుట

ద్వారా వాక్యమును స్థిరపర్చుటకు అపొస్తలులు పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందిరి.

"వారు (అపొస్తలులు) బయలుదేరి వాక్యమంతట ప్రకటించిరి. ప్రభువు వారికి సహకారుడై యుండి వెనువెంట జరుగుచు వచ్చిన సూచక క్రియల వలన వాక్యమును స్థిరపరచు చుండెను. ఆమేన్" (మార్కు 16:20). "అపుడు ప్రతివానికి భయము కలిగెను. మరియు అనేక మహాత్కార్యములు సూచక క్రియలును అపొస్తలులు ద్వారా జరిగెను" (అపొ.కా. 2:43). "అట్టి రక్షణ ప్రభువు బోధించుట చేత ఆరంభమై దేవుడు తన చిత్తానుసారంగా సూచక క్రియలచేతను మహాత్కార్యముల చేతను నానావిధములైన అద్భుతముల చేతను వివిధములైన పరిశుద్ధాత్మ వరములను అనుగ్రహించుట చేతను వారితో కూడ సాక్ష్య మిచ్చుచుండగ వినినవారిచేత మనకు దృఢపర్చబడెను" (హెబ్రీ 2 : 4).

## పరిశుద్ధాత్మ వరము

విశ్వాసియైన క్రైస్తవునిలో పరిశుద్ధాత్మ నివాసము చేయు చున్నాడని క్రొత్తనిబంధన స్పష్టముగా బోధించుచున్నది. క్రీస్తు యేసునందు దేవుడు అనేక ఆశీర్వాదములు అనుగ్రహించెను. అనేక ఆశీర్వాదములలో పరిశుద్ధాత్మ వరముకూడ ఒక ఆశీర్వాదమై యున్నది.

నీటి బాప్తిస్మము ద్వారా పరిశుద్ధాత్మ అను వరము పొందెదరు. ఈ వాగ్దానము తండ్రియైన దేవుడు తన యొద్దకు పిలిచినవారి కందరికి చెందును (అపొ. కార్యములు 2:38-39). పరిశుద్ధాత్మ వరమనగా ఆత్మ వరములు అను అర్థము కాదు. లోకమునందు గల ప్రతి వంశమును ఆయా భాషను మాట్లాడువారిని ప్రతి ప్రజను ప్రతి జనమును క్రీస్తుయొక్క మహిమ గల సువార్తద్వారా తండ్రియైన దేవుడు పిలుచు

చున్నాడు. ఆయన పిలుపును అంగీకరించి సువార్తకు విధేయత చూపు వారి కందరికి ఈ క్రొత్త వాగ్దానమును బహుమానముగా ఇచ్చు చున్నాడు.

## పరిశుద్ధాత్మ గుర్తులుగా కొందరు చేయు విడ్డూరపు కార్యక్రమాలు

1. డ్రమ్ము మొదలగు వాయిద్యములతో సభను ఉద్రేక పర్చుట
2. క్రిందపడి దొర్లుట (బట్టలు కానకుండ)
3. అర్థము లేని మాటలతో అరచుట
4. ఏడ్చుట, వణకుట, శరీరము కుదుపుకొనుట
5. గంతులు వేయుచు బొబ్బలు పెట్టుట
6. చప్పట్లు కొట్టుచు అల్లరిగా శబ్దము చేయుట
7. దేవతా పూనకము పోలిసోదె చెప్పుచు ప్రవచనమనుట
8. డ్రమ్ము శబ్దముల సంజ్ఞలకు మూనులగుట

ఇట్టివి వాక్యమునకు విరోధములని లేఖనములు బోధించు చున్నవి. లేఖనాను సారముగా నీటి బాప్తిస్మము పొందిన వానిలో పరిశుద్ధాత్మ నివాసం చేయుచున్నాడు (అ. కార్యములు 2 : 38-39) 1 కొరింథి 3 : 16 "మీరు దేవుని ఆలయమై యున్నారనియు, దేవుని ఆత్మ మీలో నివసించు చున్నాడనియు మీరెరుగరా ?" క్రొత్త జన్మలో (నీటి బాప్తిస్మమున) పరిశుద్ధాత్మ వరమును పొందు చున్నాము. ఆ పరిశుద్ధాత్మ క్రైస్తవునిలో నివాసం చేయుచున్నాడు. క్రైస్తవునిలో పరిశుద్ధాత్మ ఉన్నాడను రుజువుగా దేవుని తండ్రి నాయనా అని పిలుచుచున్నాడు. మరియు మీరు కుమారులైనందున నాయనా తండ్రియని మొఱ్ఱపెట్టు ఆత్మను దేవుడు మన హృదయములోనికి పంపెను (గలతీ 4 : 6).

నీవు కుమారుడవు ఎప్పుడైతివి? గలతీ 3:26. విశ్వసించి బాప్తి స్మము పొందినపుడు కుమారుడవైతివి. కుమారత్వమును బాప్తిస్మ ములో పొందినపుడు దేవుడు తన పరిశుద్ధాత్మను అనుగ్రహించెను. క్రొత్తగా జన్మించిన నాటినుండి పరిశుద్ధాత్మ నివాసము ప్రారంభించ బడి యున్నదని అపొస్తలుడైన పౌలు 1 కొరింధి 3 : 16 లో చెప్పి యున్నాడు. పరిశుద్ధాత్మకు ఆలయముగా ఉండునట్లు దేవుడు ఈ శరీర మును మనకు అనుగ్రహించెను. ఆయన నివాసము క్రొత్త జన్మ నందు ప్రారంభమగుచున్నది.

ఒకవ్యక్తి ప్రార్థనలోనే యున్నపుడు పరిశుద్ధాత్ముడు వచ్చి ప్రార్థన ముగిసిన తరువాత పరిశుద్ధాత్మ ఆవ్యక్తిని విడిచిపెట్టి వెళ్ళి పోవును అను అపోహ మతశాఖల వారికి ఉండేమో ? ఎంత అమాయ కత్వము ! ఎంతటి అజ్ఞానము! అందువల్లనే అబద్ధ బోధకులు అమాయకు లైన ప్రజలను వెర్రివారిగా జేసి ఏడ్వండి; వణకండి; క్రిందపడి దొర్లండి నేను డబ్బుమ్మ అధికము చేసేకొలది దేవుడు జడిసి పరిశుద్ధా త్మను మీయొద్దకు పంపించును అను దెయ్యపు బోధలతో మనుష్యు లను మోసగించు చుందురు. అమాయకపు ప్రజలను మోసగించి దేవునిజీవమార్గమునకు దూరముగా వారిని తీసికొనిపోవుచు నరక పాత్రులుగా చేయు గ్రుడ్డి బోధకులకు రెండంతల తీర్పు (2 పేతురు 2 : 1-3) గ్రుడ్డివాడు గ్రుడ్డివారికి త్రోవ చూపగలడా ? (మత్తయి 15 : 14). — M. ఆల్ఫ్రెడ్, రామచంద్రపురం.

—o—

---

గమనిక : ఇప్పుడు సత్యవాణి రేడియో కార్యక్రమాలను ప్రతి ఆది, మంగళ, గురు, శుక్ర, శని వారాల్లో యధావిధిగా వినవచ్చును. 1994 మే నెల నుండి సత్యవాణి వారమునకు ఐదు సార్లు ప్రసారము చేయబడుచున్నది.

# సంక్షిప్త వార్తలు

క్రీస్తు ఆధ్యాత్మిక సమావేశమును నిజామాబాద్ జిల్లా ముఖ్య పట్టణమైన నిజామాబాద్‌లో జూన్ 3, 4, 5 తేదీలలో ఆశీర్వాద కరంగా జరిగెను. ప్రతిదినము వందలాది ప్రజలు దేవుని వాక్యమును వినుటకు పట్టణ నలుమూలల నుండి తరలి వచ్చిరి. ఈ సభలు గుర్బా బాదిలో కట్టబడిన ప్రార్థనామందిర ఆవరణలో పెద్ద టెంట్ ఆడిటోరియంలో నిర్వహించబడెను. మరియు అందమైన ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేయబడెను. ఈ కూటములలో ఉపన్యసించుటకు రేడియో ప్రసంగీకులు జాషువా గూటంగారు, M. ఆల్‌ఫ్రెడ్‌గారు మరియు E. K. V. ప్రసాదరావుగారు ఆహ్వానించబడిరి.

ఈ సమావేశములు స్థానిక సంఘమునకు క్షేమాభివృద్ధిని కలిగించుటయేగాక వారిలో ప్రేమతత్వమును ఐకమత్యమును పెంపొందించుటకు సహాయపడెను. సోదరులు జాషువాగూటంగారు, ఆల్‌ఫ్రెడ్‌గారు, E.K.V. ప్రసాదరావుగారు దేవుని వాక్యముయొక్క మాధుర్యమును అందించి వారిని మరింతగా ప్రోత్సహించిరి. 5వ తేదీ ఆదివారం ఆరాధనలో సుమారు 250 మంది కూడుకొనిరి. సోదరులు జాషువాగూటంగారు దేవుని వాక్యమును అందించిరి. అంతకు ముందు జరిగిన యౌవనస్థుల సమావేశములో సోదరులు ప్రసాద్‌గారు చక్కటి వర్తమానము నందించి యౌవనస్థులను ప్రోత్సహించిరి.

6వ తేదీ మధ్యాహ్నం ధర్మోర అను గ్రామంలో నిర్మించబడిన విశాలమైన ప్రార్థనా మందిరమును సోదరులు జాషువా గూటంగారు రిబ్బను కత్తిరించి ప్రవేశము గావించిరి. గతంలో డిచ్‌పల్లిలో నిర్మించబడిన విశాలమైన ప్రార్థనామందిరమును కూడ జాషువాగూటంగారు ప్రవేశము గావించిరి.

సోదరులు N. టైటస్‌గారు నిజామాబాద్ జిల్లాలో పరాక్రమం

గల బలాఢ్యునిగా దేవుని రాజ్య విస్తరణలో ప్రయాసపడుచున్నారు. నిజమాబాద్ జిల్లాలో నున్న క్రీస్తు సంఘముల పని ప్రేమ, ఐక్యత, సహవాసం, ఆతిథ్యం మాదిరికరముగా నున్నది. సోదరులు బాబూరావు గారు, డేవిడ్ గారు, ప్రసాదరావు గారు, రామారావు గారు మరియు టైటస్‌గారు కుటుంబ సమేతంగా సువార్తికులకు మంచి ఆతిథ్యము నిచ్చిరి.

* * * *

జూన్ నెల 22వ తేదీనాడు వేసవి సెలవుల అనంతరం కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ మరల తెరువబడింది. ఆయా జిల్లాలనుండి వచ్చిన అనేకమంది యౌవనస్థులు ఆసక్తితో బైబిలు అధ్యాయనము చేయుటకు వచ్చియున్నారు. స్కూలు ఆవరణము నూతన అధ్యాపకులు, నూతన విద్యార్థులతో కళకళలాడుచున్నది.

* * * *

జూన్ 24, 25, 26 తేదీలలో ఒరిస్సాలోని కోరాపుట్ జిల్లాలో ప్రభువు పని ప్రారంభించుటకుగాను జాషువా గూటంగారు బయలుదేరి వెళ్ళిరి. పార్వతీపురములో Bro. జి. దానియేలుగారు, Bro. వై. తాతారావుగారు (బరంపురం, గంజాం జిల్లా, ఒరిస్సా) జాషువాగారితో కలసి కోరాపుట్ జిల్లాలో పని చేసిరి. 25వ తేదీ శనివారం ఇంచుమించు దినమంతయు వారు బంధుగామ్ అనే ఊరిలో సువార్త సేవ చేసిరి. అక్కడ ఉన్న మతశాఖలవారి మధ్య సువార్త కూటము జరిపించిరి. యౌవనస్థులతో తాతారావుగారు, జాషువా గారు బైబిలు అంశములను చర్చించిరి. 26వ తేదీ ఆదివారం ఆ గ్రామములో 5 గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందగా, వారితో కోరాపుట్ జిల్లాలో మొదటి క్రీస్తు సంఘము ఏర్పడెను. సహో. తాతారావు గారు ఒరియాలో వాక్యోపదేశము చేసిరి. జాషువాగారు తెలుగులో వాక్యోపదేశము చేయగా అది ఒరియా భాషలోనికి తర్జుమా చేయబడెను. ఈ రీతిగా అక్కడ నున్న ఒరియా ప్రజలమధ్య నూతన నిబంధన సత్యములు ప్రకటింపబడెను.

గత సంవత్సరము నుండి కాకినాడ నుండి ఒరియా భాషలో బైబిలు కరస్పాండెన్సు కోర్సు నిర్వహించబడు చున్నది. ఈ కోర్సు ద్వారా ఒరిస్సాలో వివిధ జిల్లాలలో సువార్త అందజేయబడుచున్నది. ఈ ఒరియా కోర్సుయొక్క ఫలితమే బంధుగామ్‌లో నెలకొల్పబడిన క్రీస్తుసంఘము. అక్కడ ఉన్న సంఘానికి సోదరుడు ప్రవాకర్ అనుగుల్లా సారథ్యము వహించుచున్నారు. ఒకటి రెండు మాసములలో వారి సంఖ్య బహుగా విస్తరించగలదని ప్రవాకర్ అనుగుల్లాగారి యొక్క భావన. పార్వతీపురం ఏరియాలో సోదరులు జి. దానియేలుగారు క్రీస్తు కొరకు పని చేయుచున్నారు. జాషువాగారు, తాతారావుగారు పార్వతీపురం సంఘముయొక్క ఆదివారపు ఆరాధనలో పాల్గొని వాక్యోపదేశము చేసిరి.

27వ తేదీ ఉదయం సోదరులు వై. తాతారావుగారు కళింగ పట్టణములో సువార్త సేవ కొరకు బయలుదేరి వెళ్ళిరి. జాషువాగారు ఆ సాయంకాలానికి కాకినాడ చేరుకొనిరి.

---

Regd. No. H/KD—45/KD H.O

From
SATYAVAKKU
P.O. Box 80
KAKINADA 533 001

No. ..............................

To ..............................
..............................
..............................
..............................